# ఎండా వానా

పోతుబరి నారాయణరావు



ఓ వేసవి సాయంకాలం.

ఎక్కడా ఆకు కదలటంలేదు. పగలంత ఎండ నిప్పులు చెరిగింది.

చల్లగాలి సాయంత్రానికి జోల పాడితే రాత్రి నిద్రపోతుంది. చీకటి కడుపు పండితే వేకువ ఉదయిస్తుంది.

చీకటి పడటానికి ఇంకా చాలా టైముంది.

కన్నెపిల్ల మనసులోని ఆలోచనల్లా అక్క డో మబ్బుతునక, ఇక్క డో మేఘపు పినరు కనిపించాయి. క్షణాల్లో వాతవరణం మారిపోయింది. ఆకాశం నిండా మబ్బులు కమ్ముకున్నాయి. గాలి పూర్తిగా స్తంభించింది. సూరీడు మాత్రం పడమటి కొండెక్కి వేడిగా, వాడిగా చూస్తున్నాడు.

చల్లగాలి సాగింది. అందరి ప్రాణాలూ కుదుటపడ్డాయి. సన్నగా వాన తుంపర మొదలైంది.

అటు ఎండ.

ఇటు వాన.

వాతవణం మట్టి వాసనతో గమ్మత్తుగా ఉంది. నేలమీద పడ్డ చినుకులు ఆవిరైపోతున్నాయి. వేడి సెగలు ముఖాన్ని తాకుతున్నాయి.

ప్రసాద్ కళ్ళజోడు సవరించుకొని కిటికీలోంచి వీథిలోకి చూస్తున్నాడు. ఇలాంటి వాతవరణాన్ని అలా చూడటం అతనికి సరదా.

నిజాని కీ రోజు ప్రసాద్ మనసు మనసులో లేదు. ఆనందంతో ఊగిపోతున్నాడు.

శాంతి వస్తుందట.

అదో విధమైన ఉద్వేగంతో అతని మనసంత నిండిపోయింది. శాంతి దగ్గరనుంచి నిన్ననే ఉత్తరం వచ్చింది. తన అడ్రసు ఎలా సంపాదించిందో?

చాలా సంవత్సరాల తరువాత అతని ముఖంలో ఆనందం తాండవిస్తోంది. ఆలోచనలు ఒక చోట నిలువటంలేదు.

తనది కాని తన శాంతి, తన కోసం వస్తోంది. ఈ రోజే వస్తోంది.

తూరుపు దిక్కున హరివిల్లు విరిసింది.

శాంతి. తన చిన్ననాటి నేస్తం.

శాంతిని చూసి ఎన్నో యుగాలైనట్లుంది.

ఎలా ఉందో ఏమిటో? అసలు తనని చూసి గుర్తు పడుతుందా? తనని చూడగానే ఆమె ముఖంలోని భావాలు ఎలా రంగులు మారతయో అనుకున్నాడు.

వీథిలో పిల్లలు చొక్కాలు తీసేసి ఆ నీరెండలో గంతులు వేస్తున్నారు. వచ్చీ రాని భాషలో ఏదో పాతకాలం నాటి పాట అందుకున్నా రెవరో ఆ గుంపులోంచి.

ఇంతలో మరో బాచ్ పిల్లలు రైలాట ఆడుకుంటూ అటు వచ్చారు.

వారిని చూస్తుంటే - వారి వయసు తలుచుకుంటే అసూయగా ఉంది ప్రసాద్‌కు.

ఎందు కొచ్చిన పెద్దరికం? అసలు ఈ పెద్దరికంతో ఏం సాధించాననీ - అనుకున్నాడు.

ఇప్పుడైతే తను రిటైరు అయిపోయిన తరువాత ఇలా ఈ మూల గదిలో కుర్చీకి అంటుకుపోయేడు. కాని - ఆ రోజుల్లో, ఆ వయసులో త నెన్ని ఆటలు ఆడలేదు? ఏ రోజు ఏ ఆట ఆడినా, ఎండా - వానా రోజు మాత్రం రైలు ఆటే ప్రత్యేకం. తను అమ్మ చూడకుండా మంచం నవారు కోసి తెచ్చేవాడు. వీధిలో పిల్లల్ని వరసగా నిలబెట్టి వారి చుట్టూ నవారు కట్టేవాడు. ఆ వరుసలో ఒక్కో పిల్లాడు ఒక్కో రైలు పెట్టె. తన దెప్పుడూ డ్రైవరు పాత్రే. చివర్లో గార్డు పెట్టె. ఆ స్థానం మాత్రం ఎప్పుడూ శాంతిదే.

నవారు క్రిందకు జారిపోకుండా నడుంకు దగ్గరగా బిగించి పట్టుకొని - "దూరం దూరం జరగండి" అంటూ ఏవో పిచ్చిపాటలు పాడుతూ వీధి వీధి తిరుగుతుంటే... ఆ ఉత్తుత్తి రైలు ప్రయాణం ఎంత గమ్మత్తుగా ఉండేదనీ? ఆ ఆటలో టిక్కెట్లు, స్టేషన్లు, సిగ్నల్సు... ఒక టేమిటి? అన్నీ.

ఓసారి రైలు ఏదో స్టేషన్లో ఆగింది. గార్డు ఎంతకూ పచ్చజెండా ఊపలేదు. రైలు కదలలేదు. సరిగ్గా డ్రైవరు నిలుచునేచోటనే ఓ ఎర్రచీమల పుట్ట. చీమలు తమ తోవకు అడ్డుగు నిలుచున్న కాలిని కసితీరా కుట్టాయి. తన అవస్థ గమనించిన శాంతి ఎంత అల్లరిగా నవ్వింది? ఎదుటి మనసుకి తగిలేలా హాయిగా, తీయగా నవ్వటం శాంతికి మాత్రమే తెలుసు. తరువాత స్వయంగా తనే పాదాలకు నూనె రాసి క్షణాల్లో బాధను పోగొట్టింది శాంతి.

శాంతి ప్రసాద్ పక్కింటి వారమ్మాయి.

ఆ రోజుల్లో ఎండా, వానా, చీకటి, వెలుతురూ అన్నీ ఒకేలా ఉండేవి. చల్లని సాయంత్రాలు, వెన్నెల రాత్రులు అంతా వీధి అరుగుల మీద చేరి కథలతో, కబుర్లతో కాలం వెళ్ళబుచ్చేవారు. ఎవరి ఇంట్లో ఏది చేసినా తమ తమ వాటా చిరుతిళ్ళు తెచ్చుకొని అంత కలసి తింటూ ఉంటే ఎంతో తృప్తిగా ఉండేది.

పగలంతా ఆటలు, పాటలు. సాయంత్రం పెద్దలు చీవాట్లతో పెట్టే భోజనాలు. అ దో సరదా.

"తాతయ్యా... తాతయ్యా... మనం కూడా రైలాట ఆడుకుందామా?" కిటికీలోంచి వీథిలో పిల్లల ఆటను చూస్తూ నిలుచుంది ప్రశాంతి. ఎక్కడ సంపాదించిందో, దాని చేతిలో బారెడు నవారు.

ఆ పసిదాని కేం తెలుసు - తన కుడి కాలూ, కుడి చెయ్యీ అధీనంలో లేవని.

ప్రసాద్ పెదవుల మీద కనీ కనిపించని చిరునవ్వు. వెనువెంటనే ఓ వేడి నిట్టూర్పు.

"పాపా... ప్రశాంతీ !" వంటింట్లోంచి కోడలు శారద కేకేసింది.

ప్రశాంతి నవారు ముక్క కింద పడేసి తుర్రుమంది.

ప్రసాద్ వంగి నవారు ముక్క అందుకున్నాడు.

"చుక్... చుక్... కూ..." కూత పెట్టుకుంటూ పిల్లల రైలు కిటికీ పక్కనుంచి సాగిపోయింది. పిల్లలు ఒకటే నవ్వులు, కేరింతలు.

ఆ రోజుల్లో - ఓ రోజు.

ఓ పక్క ఎండ కాస్తోంది. మరో పక్క చినుకులు ప్రారంభం అయ్యాయి. ఇంకేం? తల్లి చూడకుండా కత్తిపీటతో మంచం నవారు కోసి వీథిలోకి తయారయ్యేడు ప్రసాద్. పిల్లలు ఒక్కొక్కరే వచ్చి చేరేరు. అందరినీ వరుసగా నిల్చోబెట్టి వారి చుట్టూ నవారు కట్టి రైలు

తయారుచేశాడు ప్రసాద్. తను డ్రైవరు జాగాలో సర్దుకొని రై లింజనులా కూత పెట్టేడు. గార్డుగారి జాడలేదు. మళ్ళీ ఇంజను కూత పెట్టింది. అయినా శాంతి రాలేదు.

ఏ ఆట ఆడినా శాంతి పక్కన లేకపోతే ఏదో వెలితి. అసలు వారి ఆటల్లో శాంతి లేని సందర్భాలు, రాని సాయంత్రాలు దాదాపు లేవనే చెప్పాలి. రోజు కొకసారైనా శాంతిని చూడాలి. ఆమె అల్లరిలో, చిరునవ్వులో మైమరచిపోవాలి. అంతే.

పిల్లల్ని వీథిలో నిలబెట్టి పక్కింటి కిటికీ పక్కకు చేరేడు ప్రసాద్ శాంతిని ఆటకు పిలవాలని.

"ఇంకా చిన్నపిల్లవా ఏమిటి? వీథుల్లో మగపిల్లలతో పరుగులు తీయటానికి, గంతులు వేయటానికి..." శాంతిని కదలనీయటంలేదు తల్లి.

కిటికీ పక్కన తనను చూసి తల దించేసుకుంది శాంతి. ఆమెను అలా చూసేసరికి ప్రసాద్ మనసు ఏదోలా అయిపోయింది. వెనుతిరిగి వచ్చేశాడు. రైలాట కేన్సిలు అయిపోయింది. ఆ రోజే కాదు, తరువాత కూడా. శాంతి ఆటకు రానూ లేదు. త నా ఆట మళ్ళీ ఆడనూలేదు.

అలా తనకు ఇష్టమైన ఆటకు ఆ చిన్న తనంలోనే బ్రేకు పడింది.

శాంతి ఓణీలు వెయ్యటం ప్రారంభించింది. వసంతకాలం నాటి ప్రకృతి అందాలు ఒక్కొటొక్కటిగా వచ్చి శాంతిని చేరేయి.

మునుపటిలా శాంతితో మాట్లాడాలంటే కుదరటంలేదు. తీరా ఎదురైతే ఆమెతో మాట్లాడాలంటే నోరు పెగిలేది కాదు.

ఏదో భావం. ఏదో కొత్తదనం. చిరుచెమట పట్టేది.

కాలం కొన్ని సంవత్సరాలు ముందుకు జరిగింది. ఈలోగా ఎన్నో మార్పులు, చేర్పులు జరిగాయి.

సెలవుల్లో ఇంటికి వచ్చేడు ప్రసాద్. సాయంత్రం చల్లగాలికి కిటికీ పక్కన చేరేడు.

వాతవరణం హాయిగా ఉంది. బయట ఎండా-వానా.

ప్రసాద్ అటే చూస్తున్నాడు.

"అత్తయ్యా" అంటూ ఎవరో వచ్చారు.

అటు తిరిగాడు.

ఓ మెరుపు తీగె గుమ్మం దాటి సరాసరి వంటింట్లోకి వెళ్ళింది.

'ఎవరబ్బా?' అని అనుకుంటున్నంతలో-

"శాంతీ ! ఈ కాఫీ బాబు కిచ్చి రా తల్లీ" అమ్మ ఆ మెరుపుతీగెకు పని పూరమాయించింది.

ప్రసాద్‌ని ఇంట్లో అందరూ 'బాబూ' అని పిలిచేవారు. శాంతి కూడా.

"బాగున్నావా బాబూ?" కాఫీ కప్పు చేతికి అందించి నిలుచుంది శాంతి.

ఆశ్చర్యంగా ఆమెనే చూస్తున్నాడు.

చాలా కాలం తరువాత మళ్ళీ అంత దగ్గరగా, చనువుగా వచ్చింది శాంతి. మనిషిలోనూ, మాటలోనూ నిండుతనం.

కాసేపు పిచ్చాపాటీ తరువాత వెళ్ళిపోయింది శాంతి. ఆ నాలుగు రోజులూ పట్నం విషయాలు, విశేషాలు అడిగి తెలుసుకుంది. కబుర్లతో కాలం తీయగా గడిచింది.

ఓ రోజు - "నే నంటే నీకు ఇష్టమేనా?" సూటిగా అడిగాడు ప్రసాద్.

ఆమె కళ్ళు క్షణకాలం మెరిసి తడబడ్డాయి.

"బాబూ" అంది.

"చెప్పు శాంతీ; నీవు సరేనంటే అమ్మతో మాట్లాడతాను" అన్నాడు ఓ అడుగు ముందుకు వేసి.

"... ..."

"శాంతీ" అంటూ ఆమెను దగ్గరకు తీసుకున్నాడు.

"బాబూ, అభిమానం అంటే ఇదేనా? ఇంతేనా? ఆడది, మగవాడు ఒకటి కావడమేనా? అన్నా చెల్లెలే అయినా కలిసి తిరిగితేనే అనేక అర్థాలు కల్పిస్తారు. ఇలా ఎవరైనా చూస్తే..." మాటల్లో ఏ భావమూ లేదు.

"శాంతీ !" దెబ్బతిన్నట్లుగా చూసి ఆమెకు దూరంగా జరిగాడు.

"ఈ అభిమానం, ఆప్యాయత కలకాలం ఇలాగే నిలిచిపోవాలి. నా బాబు ఓ సామాన్యుడిలా ఆలోచించటం నేను భరించలేను."

"శాంతీ !"

"కష్టంలోనూ, సుఖంలోనూ మనసారా పాలు పంచుకోగల మంచి స్నేహితులం మనం. ఎప్పటికీ మంచి స్నేహితులు గానే మిగిలిపోదాం" అంది ప్రసాద్ చేతిని తన చేతిలోకి తీసుకుంటూ.

"నన్ను మన్నించు శాంతీ" అని మాత్రం అనగలిగేడు.

"పిచ్చిబాబు" అంటూ హాయిగా నవ్వేసింది వాతవరణాన్ని తేలికపరుస్తూ.

తరువాత ఎప్పటి నుంచో అనుకుంటున్న మామయ్య కూతురు 'పార్వతి' కోసం మామయ్య వల విసిరేడు.

శాంతి విషయంలో తను పొరపడ్డాడు. ఆ పొరపాటును సరిదిద్దుకోవాలి. 'శాంతి కానప్పుడు ఈ జీవితంలోకి ఎవరైనా ఒక్కటే' అనుకున్నాడు.

పార్వతితో తన వివాహం జరిగింది. అప్పుడే ప్రసాద్‌కు ఉద్యోగం కూడా వచ్చింది. అంత పార్వతి ఇంట్లో కాలు పెట్టిన వేళావిశేషం అన్నారు.

పట్నంలో కాపురం పెట్టేరు. పట్న వాతవరణం పార్వతిని ప్రసాద్‌కి అనుకూలంగా తీర్చిదిద్దింది.

తమ పెళ్ళయిన కొత్తలోనే శాంతీ వాళ్ళ కుటుంబం వ్యాపారరీత్యా ఊరు విడిచిపెట్టి వెళ్ళిపోయేరు. తరువాత ఎప్పుడో తెలిసింది, వాళ్ళెక్కడో ఉత్తర భారతంలో స్థిరపడ్డారని. మరింకేమీ శాంతిని గురించిన వివరాలు తెలీలేదు.

కారణం తెలీకపోయినా "శాంతి దేవత, ఆమె ఋణం జన్మలో తీర్చుకోలేను" అని చాలాసార్లంది పార్వతి.

కాలభ్రమణంలో ఎన్నో మార్పులూ, చేర్పులూ జరిగేయి.

పార్వతి ఒక మగబిడ్డను కని కన్ను మూసింది. చనిపోయేముందు - "మీకు శాంతిని కాకుండా చేసేను. నన్ను మన్నించండి" అంటూ చేతులు పట్టుకుంది.

ప్రసాద్ ఎవరు ఎన్ని విధాలుగా చెప్పినా మళ్ళీ పెళ్ళి చేసుకోలేదు. స్వంత ఊరినుంచి తల్లిని తోడుగా తెచ్చుకున్నాడు.

కొడుకు పెరిగి పెద్ద వా డయ్యాడు. ఉద్యోగం కూడా దొరికింది. పెళ్ళి చేసేడు. వారికి ఒక ఆడపిల్ల. పేరు ప్రశాంతి.

ప్రసాద్ రిటైర్ అయ్యాడు. తల్లి కూడా ఇటీవలే చనిపోయింది. కొడుకూ, కోడలూ తనని బాగానే చూసుకుంటున్నారు. అయినా జీవితం ఏదో వెలితిగా, ఒంటరిగా అనిపిస్తోంది. గతాన్ని నెమరువేసుకుంటూ ఇదిగో ఈ మూల గదిలో కాలం గడిపేస్తున్నాడు.

అతనికి నలుగురిలో ఉంటే ఒంటరిగా ఉండాలనిపిస్తుంది. ఒంటరిగా ఉంటే గతమే గుర్తుకు వస్తుంది.

ఉన్నట్టుండి ఓ రోజు హఠాత్తుగా కాలూ, చెయ్యి పని చేయటం మానేశాయి. కొడుకూ, కోడలూ కంగారుపడ్డారు. డాక్టర్లు వచ్చి 'పెరాలిసిస్' అని తేల్చారు.

ఇక తను చెయ్యగలిగింది మాత్రం ఏముంది గనుక? ఇలా ఈ మూల గదికీ, కుర్చీకీ పరిమితం అయిపోయేడు.

"తాతయ్యా... తాతయ్యా... మనం కూడా రైలాట ఆడుకుందాం తాతయ్యా" ప్రశాంతి వచ్చి

## న్యాయదర్శనం

### 'అడ్‌హాక్ నియామకాలు రాజ్యాంగ విరుద్ధం'

హర్యానా గవర్నమెంటు వారు పాఠశాలలు తెరిచే సమయానికి ఉపాధ్యాయులను తీసుకోవటం, మూసే సమయానికి తిరిగి తీసివేయటం చేస్తున్నారు. దీని వలన ఉపాధ్యాయులకు వేసవి శలవుల జీతం రాదు. చేసిన సర్వీసు గణనకు రాదు. ఉపాధ్యాయుల పదవులు ఖాళీలున్నా ఈ రకంగా అడ్‌హాక్ నియామకాలే తప్ప రెగ్యులరుగా భర్తీ చేయడం లేదు.

రతన్‌లాల్, మరికొందరు టీచర్లు కలసి ఏకాయెకి సుప్రీం కోర్టులోనే రిట్‌వేశారు. ఇలాంటి అడ్‌హాక్ నియామకాలు చేయటం తప్పని, దాని వలన నష్టపోయేది తామేనని వారి వాదన.

స్కూళ్ళు తెరవగానే ఉద్యోగాలు ఇవ్వడం. మూయగానే తీసివేయడం "హైర్ అండ్ ఫైర్" క్రిందకు వస్తుందని, అది గవర్నమెంటు అవలంబించవలసిన విధానం కాదని టీచర్ల అశక్యతను ఆసరాగా తీసుకొని వారిని దోపిడీ చేయడం క్రిందకు వస్తుందని, అది రాజ్యాంగంలోని 14 మరియు 16వ అధికరణాలకు వ్యతిరేకమని, పోస్టులు ఖాళీ ఉన్నప్పుడు రెగ్యులరుగా భర్తీ చేయకపోవడం విద్యా సంస్థల మీద విద్యార్థుల మీద దుష్ప్రభావం చూపుతుందని-వెంటనే రూల్సు ప్రకారం ఖాళీలను భర్తీ చేయాలని, పని చేస్తున్న టీచర్లకు కావలసిన అర్హతలుంటే వారిని రెగ్యులరుగా అపాయింట్ చేయాలని, ఒక వేళ కొందరి విషయంలో వయో పరిమితి దాటితే- వీలుంటే వయో పరిమితిని సడలించి వారిని కూడా తీసుకొనే విషయం పరిశీలించాలని-శెలవులలో జీతాలు కూడా ఇవ్వాలని హర్యానా గవర్నమెంటును సుప్రీం కోర్టు ఆదేశించింది.

ఎమ్.ఎస్.శర్మ

వక్కన నిలుచుంది. దాని గొంతులో అర్థింపు లేదు. చిత్రం - శాంతి గొంతు కూడా ఇంతే.

మౌనంగా నవారు అందుకొని నడుముకు బిగించుకున్నాడు. రెండో చివర ప్రశాంతి.

ఆట ప్రారంభం అయింది.

"చుక్ చుక్ రైలు వస్తోంది. దూరం దూరం తొలగండి..." తనే పాట పాడుతున్నాడు. ప్రశాంతి గొంతు కలిపి ఆనందంతో గంతులేస్తోంది.

"బాబూ !"

పిలుపులోని మాధుర్యం మనసును తాకింది. తలెత్తి చూశాడు.

శాంతి ! ఎప్పుడు వచ్చిందో, గుమ్మం దగ్గరే నిలుచుంది. మాటలోనూ, మనిషిలోనూ హుందాతనం. ఆమెలో అదే చిలిపితనం. ఆనాటిదే తీయదనం.

జుట్టు అక్కడక్కడ నెరిసింది. కళ్ళజోడు ఆమెకు కొత్త అందాన్ని తెచ్చిపెట్టింది. ఆమెకు తోడుగా వచ్చిన మని షెవరో పక్కనే ఉన్నారు.

ప్రసాద్‌కు మాట పెగిలి రావటంలేదు. జారిపోతున్న శాలువను ఒంటినిండా కప్పుకున్నాడు.

"రైలాట ఆడుకుంటున్నావు: అవును కదూ?"

"ఏదో మనవరాలు సరదా పడుతుంటే..."

మాటను మధ్యలోనే ఆపేశాడు. శాంతి వదనం ప్రఫుల్లమైంది.

"ఇంతకీ ఈ గార్డుగారి పే రేమిటో?" ఏటో చూస్తూ అడిగింది శాంతి.

"ప్రశాంతి."

శాంతి ఒంట్లో ఓ ఉద్విగ్నత ప్రకంపనం. మనసులో ఓ మధుర తరంగం. ఆమెలో మాటల కందని ఓ ఆత్మీయతా భావన.

"బయట ఎండ కాస్తూందా?" ఉన్నట్టుండి హఠాత్తుగా ప్రశ్నించింది కళ్ళజోడు తీసేస్తూ. ముందుకు రాబోయిన ఆమెకు గుమ్మం తగిలి తూలింది. కూడా వచ్చిన మనిషి చేయి అందిచ్చి ఆమెకు సాయం చేసేడు.

దిగ్భ్రమతో ఆమె వైపే చూసిన ప్రసాద్‌కు నోట మాట రాలేదు. కొండచరియ లేవో ఫెళ ఫెళ విరిగి పడుతున్నట్టు - కల్లోల తరంగాలు ఉవ్వెత్తున లేచి ఎగిరి విరిగి పడినట్టూ - అతని మెదడు సంక్షుభితమైపోయింది.

"శాంతీ !"

అతని గొంతులో దుఃఖానికీ, ఆవేశానికీ అతీతమైన ఆర్ద్రతా భావం ఏదో కదలాడింది.

శాంతి - తన శాంతి. ఏమిటిలా? ఎందుకిలా? ఎంతో ఆరాటంగా ఆమె రాకకోసం వెయ్యి కళ్ళతో ఎదురుచూస్తున్న తనకి... ఇలా తేజోవిహీనమైన కళ్ళతో... భగవాన్... శాంతిని ఇలా చూడవలసి వచ్చిందా?

'ఆత్మీయతనూ, అభిమానాన్ని వర్షించే శాంతి కళ్ళు...' ఇక ఆలోచించలేకపోయేడు. కప్పుకున్న శాలువ కిందకు జారిపోయింది.

చటుక్కున కుర్చీలోంచి లేవబోయేడు. తన అవిటితనం చెర్నాకోల దెబ్బలా స్ఫురించింది. మౌనంగా రోదిస్తూ కూలబడిపోయేడు.

శాంతి ఏటో చూస్తోంది.

ఇద్దరి కళ్ళూ ధారాపాతంగా వర్షిస్తున్నాయి.

ప్రశాంతి ఆట సందడిలో ఉంది.

బయట-

ఎండలో తడుస్తూ వర్షం.

వర్షంలో తడుస్తూ ఎండ.

భాషాభిమానులకు ప్రత్యేక శీర్షిక

# పద సంపద

"శూరుల జన్మంబు, సురల జన్మంబును, నేఱుల జన్మంబు నెఱుగ నగునె !"

అంతే కాదు, పదాల పుట్టుక తెలుసుకోవడం కూడా కష్టమే. అర్థాలు తెలిస్తే అంతే చాలు ననుకొంటాము.

పుస్తక పఠనంలోనూ, నిత్య వ్యవహారాలలోనూ మీకు అర్థం తెలియనివీ, నిఘంటువులో కూడా కనిపించనివీ కొన్ని పదాలు తటస్థ పడవచ్చు. వాటికి అర్థం తెలుసుకోవాలని మీకు ఉంటుంది గాని తెలుసుకొనే మార్గం ఉండదు. అలాంటి పదాల అర్థం కోసం "ఆంధ్రప్రభ" సచిత్ర వారపత్రిక ఒక కొత్త శీర్షికను ప్రారంభిస్తున్నది. అది "పద సంపద".

"పద సంపద"లో ప్రచురించే అలాంటి పదాలకు తెలిసిన వారెవరైనా అర్థం రాయవచ్చు. తెలుగునాట ఎందరో పండితు లున్నారు. గొప్ప భాషా శాస్త్రవేత్త లున్నారు. అవసరమైతే వారిని సంప్రతించి అర్థం తెలియజేయడానికి "ఆంధ్రప్రభ" సచిత్ర వారపత్రిక ప్రయత్నిస్తుంది.

సుమారు నాలుగు దశాబ్దుల క్రిందట శ్రీ సురవరం ప్రతాపరెడ్డిగారు "ఆంధ్రుల సాంఘిక చరిత్ర" పీఠికలో చేసిన సూచన ఈ శీర్షిక నిర్వహణకు ప్రేరణ.

ప్రబంధాలలోనూ, పదకవితలలోనూ, జానపద సాహిత్యంలోనూ నిఘంటువులో చేరని అనేక పదాలు కనిపిస్తాయి. కొన్ని పదాలు కొన్ని ప్రాంతాలలో మాత్రం వాడుకలో ఉండి మిగతా ప్రాంతాల వారికి తెలియకపోవచ్చు. కొన్ని వృత్తుల వారికి మాత్రమే తెలిసిన పదాలూ ఉండవచ్చు. రూపాంతరం చెంది, అర్థం తెలుసుకోవడం కష్టమైన పదాలూ ఉండవచ్చు. అలాంటి ఏ పదాలను గురించయినా మీరు ఈ శీర్షికకు రాయవచ్చు.

తెలుగులో ఇంతవరకు సమగ్రమైన నిఘంటువే రాలేదు. శబ్దరత్నాకరం, సూర్యరాయాది నిఘంటువులు కావ్యాలలోని పదాలకు మాత్రమే అర్థాలను ఇచ్చాయి. కొన్ని పద ప్రయోగ కోశాలూ, వృత్తి పదకోశాలూ, వ్యావహారిక పదకోశాలూ వచ్చాయి. కాని, అవి సమగ్ర నిఘంటువు కొరతను తీర్చలేకపోతున్నాయి. [ఆంధ్ర విశ్వవిద్యాలయం వారు తెలుగు వ్యుత్పత్తి పదకోశాన్ని ప్రచురిస్తున్నారు. అదీ ఇంకా పూర్తయినట్టు లేదు.]

పదాలే కాదు, పదబంధాలూ, నుడికారాలూ, సామెతలూ మొదలైన వాటిని గురించి కూడా మీరు ఈ శీర్షికకు రాయవచ్చు.

పదాల వ్యుత్పత్తిని, ప్రయోగాలను, అర్థాలను తెలుసుకోవడం ఆసక్తిదాయకమే గాక విజ్ఞానదాయకం కూడా. అది మీ "పలుకుబడి"ని పెంచుతుంది.

కవి పండితుల నుంచి, భాషాభిమానుల నుంచి ఇందుకు సంబంధించిన సూచనలను, సలహాలను ఆహ్వానిస్తున్నాము.

"పద సంపద" తెలుగు భాషాభివృద్ధికి తోడ్పడగలదని విశ్వసిస్తున్నాము.

ఎడిటర్
"ఆంధ్రప్రభ" సచిత్ర వారపత్రిక